క్లుప్తంగా...

నాగారం తైబజార్ వేలం రూ.33.03 లక్షలు



తైబజార్ వేలం పాట నిర్వహిస్తున్న దృశ్యం

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలో వారాంతపు సంతలో తైబజార్ రుసుము వసూలుకు వీలుగా మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన తైబజార్ వేలం పాట రూ.33.03 లక్షలు పలికింది. వేలం పాటలో ముగ్గురు పోటీపడగా ఎస్.కృష్ణారావు ఈ వేలంను దక్కించుకున్నాడు. ఏడాది పాటు మార్కెట్‌లో తైబజార్ రుసుము వసూలు చేసుకునేందుకు మున్సిపల్ నుంచి అవకాశం కల్పించడం జరుగుతుందని కమిషనర్ వాణీరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్‌కు ఆమోదం



మేడ్చల్ మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మేడ్చల్: 2023–24 సంవత్సరానికి గాను మున్సిపల్ బడ్జెట్‌కు మున్సిపల్ కౌన్సిల్ ఆమోదం తెలిపింది. మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ దీపికానర్సింహారెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ బడ్జెట్ సమావేశంలో కౌన్సిలర్లు బడ్జెట్‌ను రూ.1546.25 లక్షలుగా ప్రవేశపెట్టగా కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది. పట్టణంలో వివిధ సమస్యల పరిష్కారానికి చర్చలు జరిపారు. సమావేశంలో వైస్ చైర్మన్ రమేష్, కమిషనర్ రాములు, కౌన్సిలర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

మేడ్చల్: ప్రతి వార్డులో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించాలని మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు ఆంజనేయులు పార్టీ నాయకులకు సూచించారు. మేడ్చల్‌లో బీజేపీ పట్టణ నాయకులతో కలిసి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఏప్రిల్ 6వ తేదీన బీజేపీ ఆవిర్భావ దినోత్సవంతో పాటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో నాయకులు జాకట ప్రేందాస్, శ్రీనివాస్‌గౌడ్, రాఘవరెడ్డి, రతన్ రాథోడ్, అవినాష్, పురుషోత్తం, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు చదువుపై దృష్టి సారించాలి



విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: విద్యార్థులు చదువుపై దృష్టి సారించి మంచి ఉత్తీర్ణత సాధించాలని డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అన్నారు. శనివారం జవహర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే 150 మంది విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను అందజేశారు. పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు రూ.10 వేలు, రూ.5 వేల బహుమతులు అందజేస్తామని శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మహేష్, నాయకులు సాదిక్, శ్రీనాథ్, శ్రీమన్నారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నీటి ప్రాముఖ్యతపై అవగాహన

కీసర: ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా మార్చి 22 నుంచి 31వ తేదీ వరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం భోగారం గ్రామంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల విద్యాలయంలో షాలోమ్ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నీటి ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్‌రావు, షాలోమ్ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

మేడ్చల్ అన్ని రంగాల్లో దూసుకెళ్తోంది

- రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి
- 27 గ్రామ పంచాయతీలకు దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ పురస్కారాలు
- ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులకు అందజేసిన మంత్రి
- పాల్గొన్న ప్రభుత్వ విప్ రాజు, కలెక్టర్ అమయ్‌కుమార్, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి



సభలో మాట్లాడుతున్న మంత్రి మల్లారెడ్డి, చిత్రంలో ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, కలెక్టర్ అమయ్‌కుమార్ తదితరులు

సాక్షి,మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అన్ని రంగాల్లో ముందుకు దూసుకెళ్తోందని, ఇందులో జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధుల కృషి ఎంతో ఉందని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో మంగళవారం దీన్‌దయాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారాలకు ఎంపికైన 27 గ్రామ పంచాయతీలకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, జెడ్పీ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డి, కలెక్టర్ అమయ్‌కుమార్‌లతో కలిసి మంత్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల సర్పంచ్‌లు, కార్యదర్శులకు అవార్డులు అందజేయడంతో పాటు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కాగా తొమ్మిది విభాగాల్లో అభివృద్ధిలో ముందున్న గ్రామ పంచాయతీలు ఈ అవార్డులకు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించి చరిత్ర సృష్టించారన్నారు. గ్రామ పంచాయతీల్లో ప్రతి గ్రామానికి పల్లె ప్రగతిలో భాగంగా పారిశుద్ధ్య నిర్వహణ, మొక్కల పెంపకం, తడి, పొడి చెత్త వేరు చేయడం, మిషన్ భగీరథ ద్వారా మంచినీటి సౌకర్యం, ట్రాక్టర్, ట్రాలీ, వాటర్ ట్యాంకర్, డంపింగ్ యార్డులు, పల్లె ప్రకృతి వనాలు, నర్సరీలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేసి దేశంలోనే తెలంగాణ రాష్ట్రం చరిత్ర సృష్టిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారాలను 27 గ్రామాలు అందుకోవడం ఎంతో ఆనందంగా ఉందని మంత్రి పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషి చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తారని, ఇదే స్ఫూర్తితో అభివృద్ధి పథంలో మరింతగా పయనించేందుకు అందరూ సహకరించాలన్నారు. దళిత బంధు, గృహలక్ష్మి, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, రైతుబంధు, రైతుబీమా, వృద్ధులు, వికలాంగులు, ఒంటరి మహిళలకు పెన్షన్.., కేసీఆర్ కిట్ పథకాలు అందించడంతో పాటు సీఎంఆర్‌ఎఫ్‌తో ప్రభుత్వం ప్రజలకు అండగా నిలుస్తోందని మంత్రి మల్లారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ అభిషేక్ అగస్త్య, జడ్పీ సీఈఓ దేవసహాయం, జిల్లా పంచాయతీ అధికారి రమణమూర్తి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, వార్డుసభ్యులు, డీపీఎల్ఓ, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



కీసర: అవార్డు అందుకుంటున్న గోధుమకుంట గ్రామ సర్పంచ్ ఆకిటి మహేందర్‌రెడ్డి, కార్యదర్శి బి.సురేష్‌రెడ్డి, ఉపసర్పంచ్ సోమని ఆంజనేయులు, ఎంపీటీసీ కిరణ్‌జ్యోతి ప్రవీణ్ తదితరులు



ఘట్‌కేసర్: అవార్డులు అందుకున్న కొర్రెముల్, ఘనాపూర్, అవుషాపూర్, వెంకటాపూర్, కాచవానిసింగారం గ్రామాల సర్పంచులు గీత, కావేరి, గోపాల్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, కార్యదర్శులు లింగారెడ్డి, గౌతమి, కవిత, వేణుగోపాల్‌రెడ్డి



మేడ్చల్: అవార్డు అందుకుంటున్న శ్రీరంగవరం గ్రామ సర్పంచ్ విజయానంద్‌రెడ్డి, జెడ్పీటీసీ శైలజ రెడ్డి, ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, ఎంపీటీసీ ప్రకాష్ తదితరులు

కంటివెలుగును సద్వినియోగం చేసుకోండి

కీసర: కళ్ల సమస్యలను పరిష్కరించేందుకు గ్రామంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు శిబిరాన్ని గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని యాద్గార్‌పల్లి గ్రామ సర్పంచ్ పుట్టరాజు అన్నారు. మంగళవారం పంచాయతీ కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన కంటివెలుగు వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు బషరత్ అలీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎల్లంపేట్ గ్రామంలో...

మేడ్చల్‌రూరల్: మండలంలోని ఎల్లంపేట్ గ్రామంలో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం మేడ్చల్ ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజలతో కలిసి గ్రామ సర్పంచ్ వెన్నెల రామకృష్ణుడు ప్రారంభించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో కంటి పరీక్షలతో పాటు పలువురి కంటి అద్దాలు, ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వెంకటేశం, ఎంపీటీసీ కుమార్‌యాదవ్, గ్రామ కార్యదర్శి రవిందర్‌రెడ్డి, వార్డు సభ్యులు రమేశ్‌యాదవ్, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య భవన్‌లో...

జవహర్‌నగర్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మేయర్ మేకల కావ్య అన్నారు. మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ 12వ డివిజన్‌లో ఆర్యవైశ్య భవన్‌లో కార్పొరేటర్ మునిగాల సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని మేయర్ ప్రారంభించి పరిశీలించారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్ అమతుల్, క్యాంపు కోఆర్డినేటర్ షౌకత్ అలీ, నరేష్‌యాదవ్, నాయకులు యాదగిరి, చంద్రశేఖర్, సంపత్‌యాదవ్, లక్ష్మీ, బాబు, శ్రీనివాసులు, విజయ, మహేశ్వరి, పద్మ, లావణ్య, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

సేవలు చేపట్టడం సంతోషకరం



ప్రకృతి వనంలో మొక్కలకు పాదులు తీస్తున్న దృశ్యం

కీసర: మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ 2వ విభాగం విద్యార్థినిలు వారం రోజుల శిక్షణతో పాటు సేవ శిబిరం కార్యక్రమంలో భాగంగా కరీంగూడ గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు ముందుకు రావడం సంతోషకరమని సర్పంచ్ కౌకుట్ల గోపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం కరీంగూడ గ్రామంలో మల్కాజిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ 2వ విభాగం విద్యార్థినుల క్యాంప్‌ను ఆయన ప్రారంభించి విద్యార్థినులు గ్రామంలో చేపట్టిన పనులను పర్యవేక్షించారు. అనంతరం వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.

పేదలకు ఇళ్ల పట్టాలిచ్చి భరోసా కల్పించాం: మంత్రి మల్లారెడ్డి



క్రమబద్ధీకరణ పట్టాలిస్తున్న మంత్రి మల్లారెడ్డి

పోచారం: ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకుని జీవిస్తున్న పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చి భరోసా కల్పించామని కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మంగళవారం రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో అన్నోజిగూడలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జీఓ 58 కింద ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీలతో పాటు గ్రామాల్లోని పేదలకు ఇళ్ల క్రమబద్ధీకరణ పట్టాలను జిల్లా పరిషత్ చైర్మన్ మలిపెద్ది శరత్ చంద్రారెడ్డితో కలిసి మంత్రి పంపిణీ చేశారు. ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో 26, పోచారం మున్సిపాలిటీలో 110, ఇతర గ్రామాల్లో 22 మందికి పట్టాలు లభించాయి. అనంతరం 43 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను మంత్రి అందజేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ రవి, పోచారం చైర్మన్ కొండల్‌రెడ్డి, ఘట్‌కేసర్ చైర్‌పర్సన్ పావనీ, తహసీల్దారు విజయలక్ష్మి, వైస్ చైర్మన్లు రెడ్యానాయక్, మాధవ్‌రెడ్డి, కౌన్సిలర్లు చింతల రాజశేఖర్, వెంకటేష్ గౌడ్, మెట్టు బాల్‌రెడ్డి, మమతారాణి, కోఆప్షన్ సభ్యులు అక్రం అలీ, బీఆర్ఎస్ పోచారం మున్సిపల్ అధ్యక్షుడు సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీటీ రోడ్డు వేసేందుకు అనుమతి ఇవ్వండి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ నాసిన్ చెరువు నుంచి వికాస్‌నగర్ కాలనీ వరకు బీటీరోడ్డు వేసేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ మంత్రి మల్లారెడ్డి సహకారంతో జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారని, త్వరలో పనులు కూడా ప్రారంభించి ప్రజలకు అందుబాటులో తీసుకురానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మాదిరెడ్డి నర్సింహ రెడ్డి, జవహర్‌నగర్ మేయర్ మేకల కావ్య తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్ చేరుకున్న సీపీఎం జన చైతన్య యాత్ర

ఘట్‌కేసర్: సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన జన చైతన్య యాత్ర అవుషాపూర్ వద్ద ఘట్‌కేసర్ మండలంలోకి మంగళవారం ప్రవేశించింది. పలువురు నాయకులు యాత్రకు స్వాగతం పలికారు. యాత్రలో పాల్గొన్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వీరయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు స్కైలాబ్‌బాబు, జయలక్ష్మీ బాలకృష్ణ, అడువయ్య, జగదీశ్ పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సత్యం, జిల్లా కార్యవర్గ సభ్యులు రవి, యాదయ్య, అశోక్, చంద్రశేఖర్, వినోద, జిల్లా, మండల, కార్యదర్శులు, ప్రజలు, కార్యకర్తలు పాల్గొన్నారు.



క్షేత్రస్థాయిలో విచారణ

కీసర: కీసర గ్రామ పంచాయతీ కోఆప్షన్ సభ్యుడు చిత్తార్ల రమేష్‌గౌడ్‌పై వార్డు సభ్యుడు రామారం ప్రదీప్ ఇచ్చిన ఫిర్యాదుపై మంగళవారం ఎంపీఓ మంగతాయారు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టారు. కీసర శ్మశాన వాటిక అభివృద్ధికి కోఆప్షన్ సభ్యుడు రూ.5 లక్షలను విరాళంగా అందజేసినట్లు అందులో భాగంగా కొంత మేర శ్మశాన వాటిక ప్రహరీకి గనేటు, కంకర తదితర సామగ్రిని, కొంత నగదును అందజేసినట్లు పంచాయతీ కార్యాలయానికి కోఆప్షన్ సభ్యుడు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చాడని, ఇందులో వాస్తవం లేదని రామారం ప్రదీప్ గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన విషయం విదితమే. ఈ మేరకు ఎంపీఓ మంగతాయారు శ్మశాన వాటిక వద్ద నిర్మించిన ప్రహరీకి ఉపయోగించిన గనేటు రాళ్లను పరిశీలించారు. గతంలో అక్రమ లేఅవుట్లలో తొలగించిన హద్దు రాళ్లు, 30 రోజుల ప్రణాళికలో సేకరించిన పాత ఇళ్ల గనేటుతో ప్రహరీ నిర్మాణం చేపట్టారని రామారం ప్రదీప్ ఎంపీఓకు తెలిపాడు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదించనున్నట్లు మంగతాయారు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



శ్మశాన వాటిక వద్ద విచారణ చేపడుతున్న ఎంపీఓ మంగతాయారు

క్రైం కార్నర్..

వ్యక్తికి గాయాలు

ఘట్‌కేసర్: ఓఆర్ఆర్‌పై అతివేగంగా వెళ్తున్న బొలేరో వాహనం ప్రమాదవశాత్తు పల్టీ కొట్టడంతో డ్రైవర్‌కు గాయాలైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి బోధన్‌కు వెళ్తున్న బొలేరో(ఏపీ 29 టీఏ5117) ఓఆర్ఆర్‌పై అతివేగంగా వెళ్తుండంతో 81 కిలోమీటర్ల వద్ద ప్రమాదవశాత్తు వాహనం అదుపుతప్పి బోల్తా కొట్టడంతో వాహన డ్రైవర్ వీరేశం(47)కు గాయాలయ్యాయి. ఓఆర్ఆర్ అంబులెన్స్ క్షతగ్రాతుడిని ఘట్‌కేసర్ ఆస్పత్రికి తరలించారు. ఓఆర్ఆర్ పెట్రోలింగ్ ఇన్‌చార్జి మహేందర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ అదృశ్యం



బొర్ర జ్యోతి

మేడ్చల్‌రూరల్/శామీర్‌పేట్: భర్తతో గొడవపడిన మహిళ అదృశ్యమైన ఘటన శామీర్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. తూంకుంటలో నివాసం ఉండే బొర్ర చిత్తారి, బొర్ర జ్యోతి(49)లు దంపతులు. ఈ నెల 24న భర్త చిత్తారి భార్యకు చెప్పకుండా కొమూర్ దర్గాకు వెళ్లి మరుసటి రోజు ఉదయం 25న ఇంటికి వచ్చాడు. చెప్పకుండా ఎక్కడికెళ్లావు, నీ కోసం చాలా వెతికానని భర్తతో గొడవపడిన జ్యోతి అనంతరం భర్త కిరాణ దుకాణానికి వెళ్లిన సమయంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భర్త చిత్తారి పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నాగారం మున్సిపాలిటీ పాలకవర్గ సమావేశం

కీసర: నాగారంను అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్తున్నామని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించిన పాలక మండలి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సుమారు రూ.3 కోట్ల ఎల్ఆర్ఎస్ నిధులతో మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డుల్లో ఎలక్ట్రికల్ థార్డ్‌వైరింగ్ ఏర్పాటును, వివిధ వార్డుల్లో బీటీ రోడ్లు వేసేందుకు సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. దీంతో పాటు అవసరమైన చోట్ల అభివృద్ధి పనులను చేపట్టి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించనున్నట్లు ఆయన తెలిపారు.

2023–24 అంచనా బడ్జెట్ ఆమోదం..

నాగారం మున్సిపాలిటీ 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అధ్యక్షతన వార్షిక బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.33.47 కోట్ల అంచనా వార్షిక బడ్జెట్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. కార్యక్రమంలో కమిషనర్ వాణీరెడ్డి, వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, కార్యాలయ మేనేజర్ చంద్రశేఖర్, డీఈఈ రఘు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళలు, చిన్నారులకు చిరుధాన్యాలపై అవగాహన



పోషణ పక్షోత్సవాల్లో ఎంపీపీ రజిత, జెడ్పీటీసీ శైలజ



ఉద్దమర్రిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో..



కీసర ప్రభుత్వ పాఠశాలలో..

మేడ్చల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న పోషణ పక్షంలో భాగంగా ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి శ్రీరంగవరం అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని పోషకాహారంపై అవగాహన కల్పించారు. బాలికలకు మిల్లెట్స్ ఎంతో దోహదం చేస్తాయని, చిరుధాన్యాలను రోజువారీగా తీసుకునే ఆహారంలో భాగంగా చేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శైలజవిజయానంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పూడూర్ గ్రామంలో...

మేడ్చల్‌రూరల్: చిరుధాన్యాల్లో అనేక పోషకాలు ఉంటాయని, పిల్లల ఎదుగుదలకు ఎంతో ఉపయోగపడి సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉంచుతాయని మేడ్చల్ ఎంపీపీ రజితరాజమల్లారెడ్డి, జెడ్పీటీసీ శైలజలు తెలిపారు. మండలంలోని పూడూర్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాల్లో భాగంగా చిరుధాన్యాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించిన బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, గ్రామ సర్పంచ్ బాబుయాదవ్, ఎంపీటీసీ రఘు, మహిళలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉద్దమర్రి గ్రామంలో...

మేడ్చల్‌రూరల్/శామీర్‌పేట్: పోషణ పక్వాడ్ అభియాన్‌లో భాగంగా మూడుచింతలపల్లి మండలంలోని ఉద్దమర్రి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో మహిళలు, చిన్నారులకు చిరుధాన్యాలతో చేసిన వంటకాల లాభాలను గురించి వివరించి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అంజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సునీత, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

కీసర ప్రభుత్వ పాఠశాలలో...

కీసర: పోషణ పక్వాడలో భాగంగా కీసర ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు చిరుధాన్యాలపై అవగహన కల్పించారు. ఈ సందర్భంగా పోషకాహార ప్రదర్శన నిర్వహించారు. ఇందులో భాగంగా కీసర బాలికలకు హిమోగ్లోబిన్ టెస్టులు చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర పోషణ అభియాన్ అధికారులు గిరిజదేవి, ప్రశాంతి, జయమ్మ, సీడీపీఓ ఉదయశ్రీ, సూపర్‌వైజర్లు యశోద, అంజమ్మ, సర్పంచ్ మాధురివెంకటేష్, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.